TGTEL/26/A5513

# వార్త దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 56 | 04 శుక్రవారం సెప్టెంబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

## పరకాల నుంచి సిఎం పోటీ చేయాలి

- బర్తరఫ్ నన్ను తీవ్రంగా బాధించింది
- మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు
- సురేఖ కుమార్తె కొండా సుస్మిత ఫైర్

హైదరాబాద్,సెప్టెంబర్3వార్త దీపిక న్యూస్



తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా పెను సంచలనం సృష్టించింది. ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె శాపనార్థాలు పెట్టారు. తల్లి బర్తరఫ్‌పై స్పందించిన సుస్మిత "నా తల్లికి అన్యాయం జరిగింది. ఆమె పట్ల అనుసరించిన తీరు నన్ను తీవ్రంగా బాధించింది. మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. ...మిగతా 2 లో...

## ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై

- మోటార్‌స్పోర్ట్స్ సిటీ"ని ఏర్పాటు
- చెన్నై నగరం వేదికగా ఒలింపిక్స్
- సీఎం విజయ్ సంచలన ప్రకటన



చెన్నై,సెప్టెంబర్ 3వార్త దీపిక న్యూస్

క్రీడారంగాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్తూ తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. చెన్నై నగరాన్ని ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. శాసనసభ సాక్షిగా గురువారం ఆయన చేసిన భారీ ప్రకటనలు రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాభిమానులను, యువతను ఉత్సాహపరిచాయి. రాజధాని చెన్నైలో అంతర్జాతీయ స్థాయి వసతులతో కూడిన "తమిళనాడు ఒలింపిక్ సిటీ"తో పాటు, మోటార్ స్పోర్ట్స్ ప్రేమికుల కోసం ప్రత్యేకంగా ఒక "మోటార్‌స్పోర్ట్స్ సిటీ"ని ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించబోయే ఈ ఒలింపిక్ సిటీలో క్రీడాకారులకు అవసరమైన అత్యంత ఆధునిక శిక్షణా కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. హై-పెర్ఫార్మెన్స్ ట్రైనింగ్ సెంటర్లు, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్లను ఇక్కడ నెలకొల్పుతారు. అంతేకాకుండా, దేశ విదేశాల నుంచి వచ్చే అథ్లెట్లు, కోచ్‌ల కోసం పక్కా వసతి సదుపాయాలు కల్పిస్తారు. మన క్రీడాకారులు ఒలింపిక్స్ తో పాటు అంతర్జాతీయ వేదికలపై పసిడి పతకాలతో త్రైవర్ణ పతాకాన్ని ఎగరవేయడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును డిజైన్ చేస్తున్నారు. కార్ల రేసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం విజయ్, ఫార్ములా-1 నుంచి ఫార్ములా-4 వరకు అన్ని రకాల రేసులను నిర్వహించేందుకు వీలుగా.. ప్రత్యేకంగా ఒక మోటార్‌స్పోర్ట్స్ సిటీని నిర్మిస్తామని ప్రకటించారు. స్థానిక యువతలోని డ్రైవింగ్, రేసింగ్ ప్రతిభను వెలికితీసి, వారికి అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లుగా ఎదిగేందుకు శిక్షణ ఇస్తామన్నారు.

## పంజాబ్ సీఎంపై బీజేపీ సంచలన ఆరోపణలు

- 5 కోట్లకు రేప్ కేసులు సెటిల్ చేస్తున్నారు
- ఆడియో క్లిప్‌లను విడుదల చేసిన బీజేపీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2వార్త దీపిక న్యూస్

పంజాబ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆయన భార్య గురుప్రీత్ కౌర్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది. మధ్యవర్తుల ద్వారా అత్యాచారం కేసులను రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ గురువారం మీడియా సమావేశంలో ఈ ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా కొన్ని ఆడియో క్లిప్‌లను కూడా భండారీ విడుదల చేశారు. అందులో ఓ వ్యక్తి తన రాజకీయ పలుకుబడిని ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను పరిష్కరించగలమన్నట్లు మాట్లాడుతున్నారని బీజేపీ తెలిపింది. అయితే ఈ ఆడియోలో భగవంత్ మాన్, గురుప్రీత్ కౌర్ పేర్లు ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. ఆ క్లిప్‌ల ఆధారంగానే సీఎం పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని బీజేపీ పేర్కొంది. ఈ వ్యవహారం ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ గుర్వీందర్ సింగ్ చాహల్ కేసుతో ముడిపడి ఉంది. ఓ మహిళను అపహరించి అత్యాచారం చేశారనే ఆరోపణలపై చాహల్‌ను పంజాబ్ పోలీసులు కొన్ని నెలల క్రితం అరెస్టు చేశారు. అయితే ఈ వారం ప్రారంభంలో ఆయన్ను పోలీసులు విడుదల చేశారు. దీనిపై కూడా రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. "భగవంత్ మాన్, ఆయన భార్య మధ్యవర్తుల ద్వారా డబ్బులు వసూలు చేస్తూ కేసులను సెటిల్ చేస్తున్నారని" భండారీ ఆరోపించారు. రూ.5 కోట్లకు అత్యాచారం కేసులను పరిష్కరిస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నివాసం నుంచే ఇలాంటి వ్యవహారాలు నడుస్తున్నాయా? అని బీజేపీ ప్రశ్నించింది. ఈ ఆరోపణలపై పంజాబ్ ప్రభుత్వం, భగవంత్ మాన్ నుంచి తక్షణ స్పందన వెలువడినట్లు సమాచారం లేదు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసింది.



## కేబినేట్ లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

- సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్
- ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి
- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద
- కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్
- బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

హైదరాబాద్,సెప్టెంబర్3వార్త దీపిక న్యూస్

రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు.



## ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

- ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు
- ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం
- ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా హెచ్చరిక!
- మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ నేపథ్యంలో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3వార్త దీపిక న్యూస్

: ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించు కోవ డానికి ఇరాన్‌కు ఏ దేశం సహక రించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని

## నన్ను తొలగించడం కుట్రే..

- రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు
- బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు
- కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటా.. నేను పార్టీ మారను
- నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నేలా బాధ్యురాలిని
- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు
- బీసీ మహిళా మంత్రిగా అణచివేతకు గురయ్యా
- నిర్ణయంపై రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- బర్తరఫ్ పై మీడియా సమావేశంలో కొండా సురేఖ
- అధిష్టానానికి పంపిన లేఖ కొండా సురేఖ రిలీజ్



హైదరాబాద్,సెప్టెంబర్3వార్త దీపిక న్యూస్

మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే.. తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. ఈ సందర్భంగా టీవీ9తో మాట్లాడిన సురేఖ పలు కీలక విషయాలను వెల్లడించారు. తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ కూడా తీసుకోలేదని, రాజీనామా చేయాలని కూడా ఎవరూ చెప్పలేదన్నారు. అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకుని ఉండాల్సిందని అన్నారు. ...మిగతా 2 లో...

## కొండా సురేఖ బర్తరఫ్...

- మంత్రివర్గం నుంచి ఉద్వాసన
- రాజీనామాకు నిరాకరించిన సురేఖ
- బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
- గవర్నర్ కు సిఎం రేవంత్ రెడ్డి లేఖ
- సిఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు





హైదరాబాద్,సెప్టెంబర్3వార్త దీపిక న్యూస్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. ...మిగతా 2 లో...

## చట్టబద్ధతోనే దత్తత ప్రక్రియ

- అక్రమ దత్తతకు వీలులేదు
- రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు



హైదరాబాద్,సెప్టెంబర్3వార్త దీపిక న్యూస్

రాష్ట్రంలో బాలల సంరక్షణ కేంద్రాలు, సంక్షేమం, పునరావాసానికి సంబంధించిన వ్యవస్థల పనితీరుకు సంబంధించిన వివరాలపై హైకోర్టు బుధవారం ఆరా తీసింది. అక్రమ దత్తతకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా చట్టబద్ధ దత్తత ప్రక్రియ తప్పనిసరని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 2 మాసాల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులు అక్రమ దత్తతకు గురైనట్లుగా ఆరోపణలతోపాటు నమోదైన ఎఫ్ఐఆర్‌లలో అసలైన తల్లిదండ్రులను గుర్తించడంలో పోలీసుల వైఫల్యాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ మేరకు డీఎన్ఏ శాంపిల్స్ సేకరణ వంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలంటూ హోంశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో వారంలోగా నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది.

## మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి

- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలి
- బీజేపీకి మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్



హైదరాబాద్,సెప్టెంబర్3వార్త దీపిక న్యూస్

TGTEL/26/A5513
వార్త దీపిక

# ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై

మొదటిపేజీ తరువాయి

మోటార్ రేసింగ్ ట్రాక్‌ల ఏర్పాటు వల్ల కేవలం క్రీడలే కాకుండా పర్యాటక రంగం, ప్రత్యేక వాహనాల తయారీ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత వేగంగా పరుగులు తీస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ కూడా దేశంలోకి మోటార్‌స్పోర్ట్స్‌ను, ముఖ్యంగా ఫార్ములా-1 ప్రదర్శనలను తిరిగి తీసుకురావడానికి కసరత్తు ప్రారంభించింది. 2028 నాటికి భారత్‌లో ఎఫ్-1 రేసింగ్‌ను మళ్లీ పునరుద్ధరించడమే లక్ష్యంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో తమిళనాడు ప్రభుత్వం ముందుస్తుగా స్పందించి మోటార్‌స్పోర్ట్స్ సిటీని ప్రకటించడం, చెన్నైని ప్రపంచ రేసింగ్ మ్యాప్‌లో నిలబెట్టే దిశగా ఒక మాస్టర్ స్ట్రోక్‌గా భావించవచ్చు.

# మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# చట్టబద్ధతోనే దత్తత ప్రక్రియ

మొదటిపేజీ తరువాయి

2023లో దత్తత తీసుకున్న ఓ చిన్నారిని పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ నల్గొండ జిల్లా సూరారం మండలానికి చెందిన ఎం.వెంకన్న దంపతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి రూల్స్?కు విరుద్ధంగా జరిగిన దత్తతను అనుమతించలేమంటూ పిటిషన్‌ను కొట్టివేయడంతో వెంకన్న అప్పీల్ చేశారు. ఈ పిటిషన్?పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్?తో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రు తి ఓజా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేందిర బోయిలు వర్చువల్?గా హాజరై సమాధానాలిచ్చారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించేందుకు సీనియర్ న్యాయవాది బి.మయూర్‌రెడ్డిని అమికస్ క్యూరీగా హైకోర్టు నియమిస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రశ్నలకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా సమాధానమిస్తూ అనాథలను గుర్తించి సాయం అందిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లో సీడబ్ల్యూసీ కమిటీలను 2 నెలల్లో పూర్తిచేస్తామని కోర్టుకు విన్నవించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 291 బాలల సంక్షేమ గృహాలుండగా, అందులో ప్రైవేటు ఆధ్వర్యంలో 231, ప్రభుత్వ ఆధ్వర్యంలో 60 నడుస్తున్నాయన్నారు. నేరాలకు పాల్పడిన, శిక్ష పడిన బాలల కోసం ప్రత్యేకంగా 35 సంరక్షణ కేంద్రాలున్నాయని శృతి ఓజా కోర్టుకు తెలిపారు. ఆరేళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేక దత్తత కేంద్రాలు 17 ఉన్నాయని శృతిఓజా వివరించారు. అనాథలుగా, ఎవరైనా అప్పగించడం ద్వారా దొరికిన చిన్నారులను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచి, ప్రత్యేక దత్తత కేంద్రాల్లో ఉంచుతామన్నారు. నిబంధనల ప్రకారం సామాజిక దర్యాప్తు జరిపించి దత్తతకు అర్హులైనవారి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తామని ఆమె న్యాయస్థానానికి వివరించారు.

# ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

మొదటిపేజీ తరువాయి

కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# నన్ను తొలగించడం కుట్రే..

మొదటిపేజీ తరువాయి

తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే "దుష్టశక్తులు" తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు. ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపొమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. తన మీద, తన మాజీ ఓఎస్‌డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు. ఒకప్పుడు మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టారు. మాజీ సీఎం రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని తిట్టారు. నా కుమార్తె వ్యాఖ్యలకు నాపై చర్యలు తీసుకోవటం బాధాకరం. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నారని తిట్టినవారికి పదువులు ఇచ్చారు. నన్ను తొలగించినందుకు ఏమీ బాధపడటం లేదు. కారణం చెప్పకుండా తొలగించడమే చాలా బాధాకరం. బీసీ మహిళను ఇలా అవమానకరంగా తొలగించటం బాధాకరం. కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం, ఏఐసీసీపై ఉందని అన్నారు. మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్‌డీ సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు.మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు.

# కొండా సురేఖ బర్తరఫ్...

మొదటిపేజీ తరువాయి

కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

# కేబినేట్ లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

# పరకాల నుంచి సిఎం పోటీ చేయాలి

మొదటిపేజీ తరువాయి

అంతేకాకుండా, "నా తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నాను" అని పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించినవే తప్ప, ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన ఓ షెల్ కంపెనీకి తక్కువ ధరకు విలువైన భూములను కేటాయించారని సుస్మిత చేసిన ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. దీనికి తోడు, టికెట్ల కేటాయింపులో నగదు ప్రమేయం ఉందంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారాన్ని మరింత పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని, కొండా సురేఖ తొలగింపునకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు, చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేశారు. ఈ మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఫార్సులు పంపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎటువంటి సంబంధం లేదని కొండా సురేఖ గతంలోనే ప్రకటించినప్పటికీ, ఆమెపై వేటు తప్పలేదు.

# మంథని శివారులో గుడుంబా డంప్ పై మంథని పోలీసుల మెరుపు దాడులు





## సుమారుగా 2 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

వార్త దీపిక న్యూస్

మంథని పట్టణ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో పెద్ద మొత్తంలో అక్రమంగా తయారు చేసిన గుడుంబా, గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం పానకం నిల్వ చేసినట్లు నమ్మదగిన సమాచారం అందడంతో మంథని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి ఆధ్వర్యంలో మంథని పోలీసులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు.ఈదాడుల్లో ప్లాస్టిక్ క్యాన్లు, డ్రమ్ముల్లో నిల్వ చేసిన సుమారు 2 వేల లీటర్ల బెల్లం పానకం నుగుర్తించారు. అక్రమ మద్యం మార్కెట్‌లోకి వెళ్లకుండా, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనల ప్రకారం పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ ఘటనపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గుడుంబాను డంప్ చేసిన, అక్రమంగా తయారు చేసి నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. అక్రమ గుడుంబా తయారీ, నిల్వ, రవాణా,విక్రయానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్వామి తెలిపారు. అక్రమంగా తయారు చేసే గుడుంబాను ఎట్టి పరిస్థితుల్లోనూ సేవించవద్దని పోలీసులు సూచించారు. ఇది ఆరోగ్యానికి తీవ్ర హానికరమై, కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టానికి కూడా దారితీసే ప్రమాదం ఉందన్నారు. మంథని సర్కిల్, పోలీస్ స్టేషన్ పరిధిలో గుడుంబా తయారీ, నిల్వ లేదా విక్రయానికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ స్వామి తెలిపారు. ఈ దాడుల్లో లో హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణ నాయక్, రమేష్ రావు, కానిస్టేబుళ్లు శివ, అజిత్, సతీష్, అంజి పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ

-13 వార్డుల్లో 17 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు నోటీసులు

-మంథని మున్సిపాలిటీ కమిషనర్ ఎన్ మనోహర్

వార్త దీపిక న్యూస్



: మంథని పురపాలక సంఘం పరిధిలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతోందని మంథని మున్సిపాలిటీ కమిషనర్ ఎన్ మనోహర్ తెలిపారు. ఇందులో భాగంగా మంథని మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డుల్లో ఉన్న 17 పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితాలో సవరణలు అవసరమైన ఓటర్లకు బూత్ లెవెల్ అధికారులు నోటీసులు అందజేశారన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో తయా రు చేసిన ఓటర్ల జాబితాలో కొన్ని వివరాలు పొంతన లేకపోవడం, తప్పుగా నమోదై ఉండే అవకాశం ఉన్నందున, తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లను కొనసాగించేందుకు సంబంధిత ఓటర్లు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆయన సూచించారు.భారత ఎన్నిదితర అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో మున్సిపల్ కార్యాలయంలో వారికి నిర్దేశించిన తేదీలలో హాజరు కావాలని కోరారు.నిర్దేశించిన తేదీన హాజరు కాలేని వారు సెప్టెంబర్ 20వ తేదీ లోపు తమకు సంబంధించిన బూత్ లెవెల్ అధికారిని సంప్రదించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని తెలిపారు.ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలు సక్రమంగా ఉండేలా సంబంధిత ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

TGTEL/26/A5513
వార్త దీపిక

# బీజేపీపై జగ్గారెడ్డి ఫైర్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 3, వార్త దీపిక న్యూస్ :**

దళిత జాతీయ నాయకులు రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గేను కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ, సోనియాగాంధీలు ఎంతో ప్రధాన్యత ఇస్తూ గౌరవిస్తారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ కు చెందిన బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షులు దళిత నాయకులు బంగారు లక్ష్మణ్ కు బీజేపీ అత్యంత అవమాన కరంగా పదవి నుంచి బహిష్కరించారని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ లో సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పాల్గొన్నారని, ఆ తరవాత బీజేపీ అనుబంధ నాయకులు సభ ప్రాంగణం ను క్లీన్ చేశారని వివరించారు. ఇలాంటి చేయకూడదని బీజేపీపై మండి పడ్డారు. ఖర్గే రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు,దళిత నాయకుడిని అవమానించడం సరికాదని ప్రశ్నించారు..? ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే కాంగ్రెస్ పార్టీపై లేనిపోని ఆరోపణలు బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి బాస్ అయిన రాహుల్ గాంధీ, కుటుంబానికి ఆ అహంకారం లేదని, అహంకారంతో ఉన్న బీజేపీ పార్టీ ఎప్పుడైన వ్యతిరేకంగా మాట్లాడతారని పేర్కొన్నారు.



# సంగారెడ్డిలో కాంగ్రెస్ నాయకుల భారీ బైక్ ర్యాలీ..!

## డిసిసి జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి, సెప్టెంబర్ 3, వార్త దీపిక న్యూస్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తిచేసుకున్న సదర్భంగా కంది, కొండాపూర్, సంగారెడ్డి పట్టణంలో డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి జెండా ఊపి ప్రారంబించారు. మ్యానిఫెస్టో లో లేని సంక్షేమ పథకాలు సైతం అమలుచేస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకతీతంగా పేదలందరికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గం లో కాంగ్రెస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కంది, కొండాపూర్ మండల కేంద్రాల్లో, సంగారెడ్డి పట్టణం లో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. పట్టణంలో రామ్ మందిర్ నుండి ప్రారంభమైన ర్యాలీ భవానీ మందిర్, నల్సాబ్ గడ్డ, రుక్మిణి థియేటర్, శాంతి నగర్ ల మీదుగా రాజంపేట, ఇందిరా నగర్, తార డిగ్రీ కాలేజ్, బైపాస్ రోడ్డు మీదుగా ఐబీ నెహ్రూ జంక్షన్ దాకా కొనసాగింది. ర్యాలీ పూర్తయిన అనంతరం ఐబీ జంక్షన్ వద్ద మాజీ ప్రధానులు నెహ్రూ, రాజీవ్ గాంధీల విగ్రహాలకు నిర్మలా జగ్గారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ దేశం లో ఎక్కడా లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టిందని అంతేకాకుండా కోటికి పైగా రేషన్ కార్డులు అందించదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మూడేళ్ల కాలం లో మహిళ సంక్షేమమే ధ్యేయంగా మహిళ కోసం ఉచిత బస్సు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. గత ప్రభుత్వం లో డబుల్ బెడ్ రూమ్ పథకం నామ్ కే వాస్తే గా సాగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఛైర్మెన్ ప్రభు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, జార్జ్,మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మహేష్,కంది సర్పంచ్ శ్రీరామ్, రమేష్, భూమేష్, ఫయాజ్, అన్వర్, సురేష్, కిరణ్, వంశీ,రవీందర్ నాయక్, శ్రీశైలం, ప్రశాంత్, రాజు గౌడ్, హరీష్, తాహెర్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ అందించాలి..!





## శిక్షణకు అర్హులైన యువతను గుర్తించాలి..!

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 3, వార్త దీపిక (న్యూస్ ప్రతినిధి):**

జిల్లాలోని గ్రామీణ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా వారి అవసరాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణలను గుర్తించి, వివిధ శాఖలు ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐతో సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.వివిధ శిక్షణా కార్యక్రమాలకు అర్హులైన యువతీ యువకులను గుర్తించి, వారికి ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐలో శిక్షణ అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐ, వివిధ శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని గ్రామీణ యువతకు అందుబాటులో ఉన్న ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన నైపుణ్య శిక్షణలను గుర్తించాలని సూచించారు. శిక్షణా కార్యక్రమాల్లో పునరావృతం లేకుండా వివిధ శాఖల కార్యక్రమాలను ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐతో సమన్వయం చేసుకుని సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆర్‌ఎస్ఈటీఐ వార్షిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐ డైరెక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులకు జిల్లాలో సుమారు 70 రకాల వివిధ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందే అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖలకు సంబంధించి ఆర్‌ఎస్ఈటీఐలో అందిస్తున్న శిక్షణా కోర్సుల వివరాలను ఆయా శాఖల అధికారులకు వివరించారు. జిల్లాలోని వివిధ శాఖలు, ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐ సమన్వయంతో మరిన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహించే అంశంపై సమావేశంలో చర్చించారు. ఆయా శాఖల పరిధిలో శిక్షణ అవసరమున్న యువతను గుర్తించడం, వారికి తగిన కోర్సులను ఎంపిక చేయడం, శిక్షణ అనంతరం ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేలా చర్యలు చేపట్టడంపై అధికారుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ జ్యోతి, జెడ్పీ సీఈఓ జానకి రెడ్డి, ఎల్‌డీఎం సుధీర్ కుమార్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి, ఐటీఐ ప్రిన్సిపల్ తిరుపతి రెడ్డి, ఏటీఓ కలీం బేగ్, పశు సంవర్ధక శాఖ జేడీ వసంతకుమారి, డీఐసీ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు పాషా, విజయలక్ష్మి, ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐ ఫ్యాకల్టీ నర్సింలు తదితరులతో పాటు సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనార్టీ సంక్షేమ, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమాన్ని గాలికొదిలిన కాంగ్రెస్..!

## ఆరు గ్యారెంటీలు.. 420 హామీల అమలులో ఘోర వైఫల్యం..!

## రైతు అవగాహన సదస్సు, వంటావార్పు

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్






**సంగారెడ్డి, సెప్టెంబర్ 3, వార్త దీపిక న్యూస్ :**

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బి ఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు, వంటావార్పు కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఫ్లెక్సీ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను సంబరంగా జరుపుకోవాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చింత ప్రభాకర్ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా సంబరాలు ఎలా జరుపుకుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం ఆపదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో రైతుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ ఎప్పటికీ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని చింత ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ శ్రీహరి, కొండల్ రెడ్డి, మనోహర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు విఠల్, మధుసూదన్ రెడ్డి, చక్రపాణి, ఆంజనేయులు, సదాశివపేట పట్టణ అధ్యక్షులు చీల మల్లన్న, పట్టణ కార్యదర్శి వీరేశంతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# ఘనంగా కాకతీయ స్కూల్ లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు..!

## అలరించిన చిన్నారుల వేషాదరణ

**జహీరాబాద్, సెప్టెంబర్ 3, వార్త దీపిక న్యూస్ :**

పట్టణంలోని కాకతీయ స్కూల్ లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రాధాకృష్ణ వేషధారణలతో చిన్నారులు అలరించారు. చిన్నారులతో ఉట్టి కొట్టించి శ్రీకృష్ణ తత్వాన్ని చిన్నారులకు ఉపాధ్యాయులు వివరించారు. శ్రీ క్రిష్ణ వేషాలు, శ్రీ కృష్ణ లీలలు, గోపికలు వేషధారులైన చిన్నారులతో కాకతీయ పాఠశాల ఉపాద్యాయులు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుడు గోపాలకుడిగా శ్రీ కృష్ణ మహిమళను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



TGTEL/26/A5513
వార్త దీపిక

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో రైతాంగానికి తీవ్ర అన్యాయం..!






## వ్యవసాయం, సాగునీరు, యూరియా, రైతు భీమా రంగాలను నిర్వీర్యం.

## ఎమ్మెల్యే మాణిక్ రావు

**జహీరాబాద్, సెప్టెంబర్ 3, వార్త దీపిక న్యూస్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల విఫల పాలనలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, మాజి డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన 7 పట్టణంలో నియోజవర్గ రైతులు , బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి అనంతరం లైఫ్ స్టైల్ కాంప్లెక్స్ (మోర్ సూపర్ మార్కెట్) వద్ద వ్యవసాయం, సాగునీటి రంగం, యూరియా కొరత, రైతుబీమా విధ్వంసంపై రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేసిందని, రైతుబంధు, రైతుబీమా, సాగునీటి ప్రాజెక్టులు, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో తెలంగాణ రైతాంగానికి అండగా నిలిచిందని ఎమ్మెల్యే గారు గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలు మరింత తీవ్రమయ్యాయని ఆయన విమర్శించారు. రైతుబంధు సకాలంలో అందకపోవడం, రైతుబీమా అమలులో నిర్లక్ష్యం, సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం, యూరియా కోసం రైతులు రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేస్తోందని ఎమ్మెల్యే మండిపడ్డారు. రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదని ప్రశ్నించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రైతు కంట కన్నీరు వస్తే ఆ ప్రభుత్వానికి పతనం తప్పదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, యూరియా కొరతను నివారించి, రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ రైతుల పక్షానే ఉంటుందని, రైతుల హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఈ రైతు సదస్సులో మాజి మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజి ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, జహీరాబాద్ మండలాల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, సంజీవ్ రెడ్డి, నర్సింలు, మాజి మున్సిపల్ చైర్మన్ లు అల్లాడి నర్సింలు, తంజిం, పాక్స్ చైర్మన్ స్రవంతి అరవింద్ రెడ్డి,మాజి పట్టణ అధ్యక్షులు యాకూబ్, జహీరాబాద్, కోహీర్ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ లు, మాజి మండల పార్టీ అధ్యక్షులు బొగ్గుల సంగమేశ్వర్, నరసింహ రెడ్డి,కలిమ్, రైతులు , బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం లో విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత.

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.

**వార్త దీపిక న్యూస్**

భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించి విద్యార్థినులతో కలిసి అల్పాహారాన్ని పరిశీలించి,వారికి అందుతున్న ఆహారం నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టి, ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులు ఆకలితో పాఠశాలకు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, విద్యార్థుల సంక్షేమాన్ని తల్లిదండ్రుల బాధ్యతగా భావించి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించిందని,దేశంలోనే ఆదర్శవంతమైన విధంగా బ్రేక్‌ఫాస్ట్ పథకం, మధ్యాహ్న భోజన పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని తెలిపారు.శ్యాంపేట మండలంలోని 27 పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాలలో మొత్తం 922 మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నూతన భవనాల నిర్మాణం, డిజిటల్ విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు,పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు వంటి



కార్యక్రమాల ద్వారా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాల భవనాల మరమ్మతులు చేపట్టడంతో పాటు ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేస్తూ విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోం దన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారనే విషయానికి అనేక ఉదాహరణలు ఉన్నాయని,బీసీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి సైదులు గారు కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఉన్నతాధికారిగా ఎదిగారని గుర్తుచేశారు.కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు.అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. వారి విద్యా పురోగతి, అవసరాల గురించి తెలుసుకుని ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచిం చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,

# ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా రేవంత్ ప్రభుత్వం పనిచేస్తుంది.ఎమ్మెల్యే జీఎస్సార్..

**వార్త దీపిక న్యూస్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలను కేంద్రబిందువుగా చేసుకుని సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అనే మూడు సూత్రాలతో ప్రజా ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి కొత్త దిశను నిర్దేశించిందన్నారు. గత వెయ్యి రోజుల కాలంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు.వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని, రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ చేసి లక్షలాది మంది రైతులను రుణభారం నుంచి విముక్తులను చేసిందన్నారు. రైతు భరోసా, సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్, రైతు బీమా వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు అండగా నిలిచిందని, వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానానికి చేరుకోవడం ప్రభుత్వ విజయాలకు నిదర్శనమని పేర్కొన్నారు.మహిళల సాధికారత కోసం మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, కల్యాణలక్ష్మి, మహిళా సంఘాలకు భారీ స్థాయిలో బ్యాంకు లింకేజీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.అలాగే కొత్త రేషన్ కార్డులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం పంపిణీ ద్వారా ఆహార భద్రతను బలోపేతం చేసిందన్నారు.విద్యారంగంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం, ప్రీ–ప్రైమరీ తరగతుల ప్రారంభం, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు వంటి చర్యలు ప్రభుత్వ విద్యకు కొత్త ఊపునిచ్చాయని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వేలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు.వైద్య రంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం, కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. భూ భారతి



చట్టం, భూధార్ వ్యవస్థ, ప్రజాపాలన–అభయహస్తం, మండల ప్రజావాణి, వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు వంటి పరిపాలనా సంస్కరణలతో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందన్నారు.పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల అభివృద్ధి, ఐటీ రంగ విస్తరణలో తెలంగాణ విశేష పురోగతి సాధించిందని, భారీ పెట్టుబడులు, కొత్త పరిశ్రమలు, వేలాది ఉద్యోగ అవకాశాల సృష్టి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేసిందన్నారు. రీజినల్ రింగ్ రోడ్, మెట్రో విస్తరణ, విమానాశ్రయాల అభివృద్ధి, మూసీ పునరుజ్జీవన ప్రణాళిక వంటి ప్రాజెక్టులు భవిష్యత్ తెలంగాణ రూపురేఖలను మార్చనున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే జీఎస్సార్ తీవ్ర విమర్శలు చేశారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని, రైతులు మరియు ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో రాష్ట్ర సంపదను దోచుకున్న పార్టీ బీఆర్ఎస్ అని ఆరోపించారు.మొత్తంగా వెయ్యి రోజుల ప్రజాపాలన తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ముందుకు తీసుకెళ్తోందని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.బి

# తాండూర్ విలేమున్ హైస్కూల్ చౌరస్తాకు నామకరణం..!

**తాండూర్, సెప్టెంబర్ 3, వార్త దీపిక న్యూస్ :**

పురపాలక సంఘం పరిధిలోని ప్రధాన కూడలికి విలేమున్ హై స్కూల్ చౌరస్తాగా అధికారికంగా నామకరణం చేశారు. గురువారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు కూడలికి పాఠశాల పేరు ఖరారు చేయడంలో కీలకపాత్ర పోషించిన 7 వ వార్డు కౌన్సిలర్ ఇర్షాద్ కు పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు.



# మోడల్ పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు..!

**తాండూర్, సెప్టెంబర్ 3, వార్త దీపిక న్యూస్ :**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా తాండూర్ పట్టణంలో మోడల్ పాఠశాలలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.పట్టణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రాధాకృష్ణ వేషధారణలతో చిన్నారులు అలరించారు. చిన్నారులతో ఉట్టి కొట్టించి శ్రీకృష్ణ తత్వాన్ని చిన్నారులకు ఉపాధ్యాయులు వివరించారు. శ్రీ క్రిష్ణ వేషాలు, శ్రీ కృష్ణ లీలలు, గోపికలు వేషధారులైన చిన్నారులతో కాకతీయ పాఠశాల ఉపాద్యాయులు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుడు గోపాలకుడిగా శ్రీ కృష్ణ మహిమళను కొనియాడారు.

# రాష్ట్ర ఫుట్‌బాల్ బరిలో రెచిని బిడ్డ

## జిల్లా స్థాయిలో సత్తా చాటి..

## రాష్ట్రస్థాయి పోటీలకు దేవా అస్విత ఎంపిక

**వార్త దీపిక న్యూస్**

తాండూర్ మండలంలోని రెచిని పీఎం శ్రీ పాఠశాలకు చెందిన విద్యార్థిని దేవా అస్విత, తండ్రి దేవా రమేష్, జిల్లా స్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.సెప్టెంబర్ 1న ఆసిఫాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో దేవా అస్విత ఉత్సాహంగా పాల్గొని తన క్రీడా ప్రతిభను చాటుకుంది. దీంతో ఆమె రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వర్గాలు వెల్లడించాయి.రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు సెప్టెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు నిజామాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అస్విత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.విద్యార్థిని దేవా అస్విత రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల గ్రామ సర్పంచ్ రాంబాయి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాసాడి ప్రదీప్, ఏఏపీసీ చైర్మన్ నాగమణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ నిట్టూరి సంతోష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అస్వితను అభినందిస్తూ, రాష్ట్రస్థాయి పోటీల్లో విజయవంతంగా రాణించాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల



# గణపతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**వార్త దీపిక న్యూస్ :**

రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం నాడు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో త్వరలో జరగనున్న గణపతి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్ జల్ద అరుణ శ్రీ , కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి తో కలిసి ఎమ్మెల్యే సమీక్షించారు.గణపతి ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శానిటేషన్, రోడ్లు, వీంచి నిమజ్జనం వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సూచించారు.ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్, మున్సిపల్ అధికారులు, వీ=ా, ఋచీూణజూ, =ఖీజూ, చీూజ, సింగరేణి అధికారులు, పోలీస్ అధికారులు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984